వంతెన నిర్మించారు.. రోడ్డు మరిచారు

- కంకరరోడ్డుపై అదుపు తప్పుతున్న వాహనాలు
- ఇరువైపులా తారురోడ్డు వేయాలని గ్రామస్తులు, వాహనదారుల వినతి



కంకర రాళ్లు తేలిన రోడ్డు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి–సోమనపల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై రూ.రెండు కోట్లకు పైగా నిధులతో హైలెవల్ వంతెన నిర్మించిన కాంట్రాక్టర్ ఇరువైపులా తారు రోడ్డు వేసే పనులు నిలిపివేశాడు. దీంతో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పుతుండగా, వాటి పక్క నుంచి భారీ వాహనాలు వెళ్లే క్రమంలో కంకర రాళ్లు పక్కనున్న వారిపై పడడంతో గాయాలపాలవుతున్నారు. ఇరువైపులా తారు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

తారురోడ్డు వేయాలి..

బ్రాహ్మణపల్లి–సోమనపల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై లోలెవల్ వంతెన ఉండడంతో ఏటా వర్షాకాలంలో భారీ వర్షాలకు వచ్చే వరద నీటితో వంతెన ముంపునకు గురయ్యేది. పాలకుర్తి, వెల్గటూర్, ధర్మారం, పెగడపల్లి, ఎండపల్లి, జగిత్యాల మండలాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పొట్యాల, ధర్మారం ఆర్టీసీ బస్సు సర్వీసులు సైతం కొన్నిరోజులు రద్దు చేస్తుండేవారు. వంతెనకు పక్కనే ఉన్న సోమనపల్లి, పొట్యాల, విసంపేట, మద్దిర్యాల, ఆకెనపల్లి, ఎగ్లాస్‌పూర్ గ్రామాలకు సంబంధాలు తెగిపోయేవి. గడిచిన పాలకవర్గంలో వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించి శంకుస్థాపన చేసినప్పటికీ సకాలంలో నిధులు మంజూరు కావడంలో జాప్యం జరిగింది. స్థానిక గ్రామాల ప్రజలు ప్రస్తుత ఎమ్మెల్యేపై ఒత్తిడి పెంచడంతో పనుల్లో పురోగతి సాధించి మూడునెలల క్రితం రాకపోకలు ప్రారంభించారు. అయితే హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ.రెండు కోట్ల పైచిలుకు నిధులు వెచ్చించిన కాంట్రాక్టర్ ఇరువైపులా తారు రోడ్డు వేయలేదు. దీంతో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు స్పందించి ఇరువైపులా తారు వేయించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు తొలగించాలి



ఏటా వర్షాకాలంలో లోలెవల్ వంతెన పైనుంచి వరద నీరు పారుతుండడంతో అటువైపుగా ఉన్న తాటి, ఈతవనాల దగ్గరకు చేరే పరిస్థితి లేకపోతుండే. ఎన్నో ఏళ్లుగా హైలెవల్ వంతెన నిర్మిస్తామని పాలకులు చెప్పినప్పటికీ సకాలంలో పూర్తి కాకపోవడంతో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ప్రత్యేక చొరవతో పూర్తి చేయించారు. ఇరువైపులా తారు రోడ్డు వేసి ఇబ్బందులు తొలగించాలి.

– మద్ది తిరుపతిగౌడ్, బ్రాహ్మణపల్లి గ్రామస్తుడు

సాంకేతిక కారణాలతో ఆలస్యం



వంతెన నిర్మాణం చేపట్టిన సంబంధిత కాంట్రాక్టరుతోనే ఇరువైపులా రహదారి నిర్మాణం చేయిస్తాం. సాంకేతిక కారణాలతోనే జాప్యం జరుగుతోంది. త్వరలోనే ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తాం.

– ఎంఏ.అలీం, ఎంపీడీవో, అంతర్గాం

కేశోరాంలో ముదురుతున్న బోనస్ వివాదం



నోటీసు అందజేస్తున్న మనోహర్‌రెడ్డి

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కంపెనీలో దీపావళి బోనస్ వివాదం రోజురోజుకూ ముదురుతోంది. కార్మికుల డిమాండ్‌కు తగ్గట్టుగా యాజమాన్యం బోనస్ చెల్లించకపోవడంతో ఇరువర్గాల మధ్య కొన్నిరోజులుగా వివాదం కొనసాగుతోంది. దీనిలో భాగంగానే ఐదురోజులుగా కాంట్రాక్ట్ కార్మికసంఘం అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు కౌశికహరి ఇచ్చిన పిలుపు మేరకు కాంట్రాక్ట్ కార్మికులు టూల్ డౌన్ సమ్మె చేస్తున్నారు. మరోవైపు శనివారం పర్మినెంట్ కార్మికసంఘం నాయకులు కూడా సమ్మెకు పిలుపునిచ్చారు. యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ పార్థసారథిని కార్మికసంఘం నాయకులతో కలిసి సమ్మె నోటీస్ అందజేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి దాడి మహేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పర్శవేని శ్రీనివాస్, నారాయణ, కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు. కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన టూల్‌డౌన్ సమ్మె శనివారం కూడా కొనసాగింది. కార్మికసంఘం అధ్యక్షుడు కౌశికహరి కంపెనీ ఆసుపత్రి ఆవరణలో కార్మికులతో కలిసి సమావేశం నిర్వహించారు. సోమవారం నుంచి నిర్వహించనున్న నిరవధిక సమ్మె విషయమై చర్చించారు. కార్మికసంఘం ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్, నాయకులు పెరుమాండ్ల రమేశ్, బత్తిని సతీశ్‌గౌడ్, వేల్పుల సంపత్, కండెస్వామి, ముల్కనూరి శ్రీధర్, శిలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారిణికి సన్మానం



మనోజ్ఞను సన్మానిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

ధర్మారం: జాతీయస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన ధర్మారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల విద్యార్థిని తుమ్మల మనోజ్ఞను కలెక్టర్ కార్యాలయంలో శనివారం సాయంత్రం కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు. ఎస్‌జీఎఫ్ అండర్–17 విభాగంలో మనోజ్ఞ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికైంది. డిసెంబర్ 6 నుంచి 10వ తేదీ వరకు జమ్మూకశ్మీర్‌లోని జమ్మూలో రాష్ట్ర టీమ్ తరఫున మనోజ్ఞ పాల్గొంటుంది. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థిని సన్మానించారు. విద్యాలయం ప్రిన్సిపాల్ ఈరవేని రాజ్‌కుమార్, పీఈటీలు బైకని కొమురయ్య, మేకల సంజీవరావు పాల్గొన్నారు.

సమగ్ర సర్వే వివరాల కంప్యూటరీకరణ



జూలపల్లి: పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఎంపీవో

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో పదిహేను రోజులు నిర్వహించిన సమగ్ర సర్వేకు సంబంధించిన కంప్యూటరీకరణ చకచకా సాగుతోంది. మండల కేంద్రంతో పాటు 13 పంచాయతీల్లో 10,374 కుటుంబాలను గుర్తించగా 99శాతం సర్వే పూర్తయింది. సర్వే చేసిన వివరాలను కంప్యూటరీకరణ చేసే ప్రక్రియను ఎంపీడీవో పద్మజ, ఎంపీవో అనిల్‌రెడ్డి శనివారం పరిశీలించారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలో చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీ ఎంపీడీవో కార్యాలయంలో చురుకుగా సాగుతోంది. మండలంలోని తొమ్మిది పంచాయతీల్లో శనివారం నాటికి 85శాతం సర్వే పూర్తయినట్లు అధికారులు చెప్పారు.

ఓదెల: మండల పరిషత్ కార్యాలయంలో సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ వేగవంతమైంది. శనివారం మండలంలోని 22గ్రామాలకు చెందిన సర్వే వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నారు. ఎంపీడీవో తిరుపతి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

వరకట్న దురాచారాన్ని రూపుమాపండి



మాట్లాడుతున్న జడ్జి టి.శ్రీనివాసరావు

గోదావరిఖనిటౌన్: వరకట్న దురాచారాన్ని ప్రతీఒక్కరు రూపుమాపాలని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక గాంధీనగర్‌లోని గీతాంజలి పాఠశాలలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వరకట్నం ఇవ్వడం, తీసుకోవడం నేరమని అన్నారు. అనంతరం న్యాయ విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల కరస్పాండెంట్ కంది రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల తనిఖీ

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్, పాలకుర్తి, కొత్తపల్లి, ఈసాలతక్కళ్లపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్ తనిఖీ చేశారు. కేంద్రాల నిర్వహణ తీరును పరిశీలించి స్థానికంగా నెలకొన్న సమస్యలు రైతులను అడిగి తెలుసుకున్నారు.

నియామకం



రాజ్‌కుమార్

రామగిరి: ఐఎన్‌టీయూసీ సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–2కు చెందిన మద్దె రాజ్‌కుమార్‌ను నియమించారు. శనివారం మినిమమ్ వేజ్‌బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

ప్రభుత్వ భూమికి హద్దులు ఏర్పాటు



హద్దులు ఏర్పాటు చేస్తున్న అధికారులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పందిల్ల గ్రామంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో శనివారం రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన కుమార్ అనే వ్యక్తి 805/3 సర్వే నంబర్‌లో భూమిని అక్రమంగా చేసుకున్న పట్టాను రద్దు చేసినట్లు తహసీల్దార్ ఎండీ వకీల్ తెలిపారు. అక్రమంగా పట్టా చేసుకున్నట్లు గ్రామస్తులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే చేసి ప్రభుత్వ భూమిగా నిర్ధారిస్తూ హద్దులు నిర్ణయించామని పేర్కొన్నారు. ఈ భూమిలో సాగు చేసినా, ఆక్రమణకు పాల్పడినా శిక్షార్హులవుతారని హెచ్చరిస్తూ నోటీస్ బోర్డు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఎండీ వకీల్ తెలిపారు. అజీమ్, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• రెండు గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ కమిటీలు ఖరారు

ధర్మారం: మండలంలోని ఖిలావనపర్తి, కానంపెల్లి గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ కమిటీలు నియమించినట్లు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మద్దునాల మల్లేశం, సాతరాజుల సుమన్ తెలిపారు. ఆయా గ్రామాల్లో సంఘం సభ్యులతో శనివారం సమావేశం ఏర్పాటు చేసి కమిటీలను ఖరారు చేసినట్లు వారు పేర్కొన్నారు. ఖిలావనపర్తి గ్రామశాఖ అధ్యక్షుడిగా కొత్తూరి మహేందర్, ప్రధాన కార్యదర్శిగా మద్దునాల రమేశ్, కార్యదర్శిగా కాంపెల్లి మధునయ్య, కోశాధికారిగా కాంపెల్లి కనుకయ్య, అదేవిధంగా ఖానంపెల్లి గ్రామశాఖ అధ్యక్షుడిగా కల్వల అనిల్, ప్రధాన కార్యదర్శిగా తాండ్ర మల్లేశం, కార్యదర్శిగా రెడపాక రవికుమార్, కోశాధికారిగా కల్వల రాజేశంతో పాటు కార్యవర్గసభ్యులను నియమించినట్లు తెలిపారు.

• ట్రినిటిలో మోటివేషనల్ సెమినార్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం ఎన్‌పీటెల్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు లైఫ్ కోచ్, ఎల్‌ఐసీ డీవో రాజశేఖర్ సహకారంతో మోటివేషనల్ సెమినార్ నిర్వహించారు. వక్తలు పలు సూచనలిచ్చారు. అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మణిగణేశ్, కోఆర్డినేటర్లు అశోక్‌కుమార్, ప్రభాకర్, రమేశ్ ఉన్నారు.

• ఎల్‌వోసీ అందజేత

రామగిరి: మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన అనవేని సంధ్యకు రూ.లక్ష విలువ గల ఎల్‌వోసీని శనివారం మంత్రి శ్రీధర్‌బాబు సహాయకులు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న సంధ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఎల్‌వోసీకి దరఖాస్తు చేసుకోగా మంజూరైన ఎల్‌వోసీని సంధ్య కుటుంబ సభ్యులకు అందజేశారు.

• బీసీ సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రమైన పెద్దపల్లిలో బీసీ సంఘం నాయకులు ఈనెల 25న హైదరాబాద్‌లో తలపెట్టిన బీసీ సమరభేరికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. నాయకులు మనోజ్‌గౌడ్, నోముూరి శ్రీధర్‌రావు, వివేక్ పటేల్, శ్రీమాన్, భాస్కర్ ఉన్నారు.

• మాలల ఒత్తిడితోనే ఎస్సీ వర్గీకరణ జాప్యం

గోదావరిఖనిటౌన్: మాలల ఒత్తిడితోనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి జాప్యం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ నాయకులు రుద్రారపు రామచందర్ ఆరోపించారు. పట్టణంలో శనివారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్పొరేషన్ ఇన్‌చార్జి రేణికుంట్ల సాగర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మంథని చందు, మడిపల్లి దశరథం, పల్లె బాపు, కాసిపేట రాజయ్య, మాతంగి కుమార్, స్వామి, కాంపెల్లి శ్రీనివాస్, కొమురయ్య పాల్గొన్నారు.

• ఉరివేసుకుని కూలీ మృతి

గోదావరిఖని: స్థానిక చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన పాల్ మోహన్(40) శనివారం ఉరివేసుకుని మృతి చెందినట్లు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై టి.శ్రీనివాస్ తెలిపారు. కూలీ పని చేసుకుని జీవిస్తున్న మోహన్ భార్యభర్తల మధ్య గొడవ జరగడంతో భార్య ఏడాదికింద పుట్టింటికి పోయింది. ఒంటరిగా ఉంటున్న మోహన్ జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి అన్న ధర్మేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

• కరాటే పోటీలకు ఎన్‌రోల్‌మెంట్ ప్రారంభం

జ్యోతినగర్: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కరాటే టోర్నమెంట్ పోటీల ఎన్‌రోల్‌మెంట్ ప్రారంభమైంది. శనివారం ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లోని టీవీ గార్డెన్స్‌లో ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్ ప్రారంభించారు. ఆదివారం పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తగరపు శంకర్, వడ్డెపల్లి సురేశ్, శ్రీనివాస్, విజయ్‌కుమార్, లక్ష్మణ్, సోమశేఖర్, శోభారాణి, సురేందర్ పాల్గొన్నారు.

• సీపీఎం జిల్లా మహాసభల ర్యాలీ

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో సీతారాం ఏచూరి ప్రాంగణంలో సీపీఎం జిల్లా మూడో మహాసభల ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగసభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి పాల్గొని మాట్లాడారు. సభాధ్యక్షులు ఎం.రామాచారి, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎరవెల్లి ముత్యంరావు, అనుమాల మహేశ్వరి, వేల్పుల కుమారస్వామి, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు నాంసాని శంకర్, కోశాధికారి ఎస్.భిక్షపతి, గీట్ల లక్ష్మారెడ్డి, నాగలక్ష్మి, మల్లేశ్, తుంగపిండి మల్లేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, పీఈటీలు

ధర్మారం: మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఎస్‌జీఎఫ్ అండర్–19 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ కొమురయ్య తెలిపారు. ఎంపికైన వారిలో శరణ్య, అశ్విత, బి.పూజ, ఐలేశ్వరి, సాయిశృతిక, హేమలత, పూజ, సుష్మిత ఉన్నారు. ఈ నెల 25 నుంచి 27 వరకు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరిగే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 19 పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తరఫున వీరు పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను విద్యాలయం ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు కొమురయ్య, సంజీవరావు అభినందించారు.

ఉసిరి చెట్టుకు కార్తీక పూజలు



పూజలు చేస్తున్న మహిళలు

జ్యోతినగర్: కార్తీకమాసం సందర్భంగా ఉసిరి చెట్టుకు కార్తీక పూజలు చేశారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలో శ్రీసీతారామ సేవాసమితి సభ్యులు శనివారం ఉసిరి చెట్టుకు నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. బోనం సమర్పించి సామూహిక భోజనాలు చేశారు. కార్యక్రమంలో గోలివాడ చంద్రకళ, కంది సుజాత, బిల్లా శ్రీదేవి, మంద రమాదేవి, మెడగోని స్వప్న, గాదం సరిత, లక్ష్మి, రాజేశ్వరి, చంద్రకళ, లత, కవిత, సుశీల, శ్రీలత, రత్నమాల, రమ, విజయ, మేడి తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాలి

జూలపల్లి: యువత క్రీడల్లో నైపుణ్యం పెంచుకొని, రాణించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేశ్ సూచించారు. జగిత్యాల జిల్లా అల్లీపూర్ జరిగే వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే జూలపల్లి క్రీడా జట్టుకు శనివారం మండల కేంద్రంలో స్పోర్ట్స్ టీషర్టులు అందజేశారు. నాయకులు గుడిపాటి సంతోష్‌రెడ్డి, భూసారపు రవీందర్, మెరుగు రమేశ్, రాజేశ్వర్, వెంకటేశ్, అజయ్, అశోక్ ఉన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు

ధర్మారం: మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ గెలుపొందడంతో ధర్మారం మండల కేంద్రంలో పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకుని టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు.


కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత



చెక్కులు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్‌కు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ఆదేశాల మేరకు శనివారం కాంగ్రెస్ కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, పెద్దపల్లి వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. డివిజన్ అధ్యక్షుడు రాజు ఉన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



మంథని: జాతీయస్థాయి కరాటే పోటీల్లో జపాన్ హిటోరియో కరాటే మంథని విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కరాటే శిక్షకుడు కావేటి సమ్మయ్య తెలిపారు. కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో మంథనికి చెందిన విద్యార్థులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను సినీ హీరో సుమన్ అభినందించారు.

కస్తూర్బా విద్యార్థులకు వైద్య పరీక్షలు

రామగిరి: మండలంలోని పన్నూర్ గ్రామంలో గల కస్తూర్బా బాలికల పాఠశాలలో శనివారం మండల వైద్యాధికారి ప్రదీప్‌కుమార్ విద్యార్థులకు వైద్యపరీక్షలు చేశారు. స్పెషల్ ఆఫీసర్ మంజు, సీహెచ్‌వో భరత్‌కుమార్ పాల్గొన్నారు.



జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం సింధూర కళాశాల గ్రౌండ్ మందుబాబులకు అడ్డాగా మారింది. సింధూర ఇంజనీరింగ్ కళాశాల కొన్నేళ్ల క్రితం మూతపడింది. దీంతో మైనార్టీ రెసిడెన్షియల్‌కు లీజుకు ఇచ్చారు. గడువు పూర్తి కావడంతో ఖాళీ చేసి మరోచోటకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన మందుబాబులు రాత్రి సమయాల్లో గ్రౌండ్‌లో విచ్చలవిడిగా మద్యం సేవించి ఖాళీసీసాలను పగులగొడుతున్నారు. ఉదయం గ్రౌండ్‌లో వాకింగ్ చేస్తుండగా మద్యం సీసాముక్కలు గుచ్చుకుంటున్నాయని వాకర్స్ వాపోతున్నారు. మందుబాబుల ఆగడాలను అరికట్టాలని ఎన్టీపీసీ పోలీసులను కోరారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



సన్మానిస్తున్న అధికారులు

రామగిరి: సెక్యూరిటీ సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని కార్పొరేట్ సెక్యూరిటీ విభాగం జీఎం సీ.హెచ్.లక్ష్మీనారాయణ ఆదేశించారు. ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో ఆయన పర్యటించారు. ఆర్జీ–3 ఇన్‌చార్జి జీఎం గుంజపడుగు రఘుపతిని కలిసి ఏరియాలో సెక్యూరిటీ పరంగా చేపడుతున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. బాధ్యతలు స్వీకరించాక మొదటిసారి వచ్చిన సందర్భంగా లక్ష్మీనారాయణను జీఎం, అధికారులు సన్మానించారు. ఏపీఏ ఏరియా, ఓసీపీ–1, 2లలో ఉన్న చెక్‌పోస్టులు, స్టోర్స్, స్క్రాప్ యార్డ్, వ్యూ పాయింట్లను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. సంస్థ ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ విభాగం సిబ్బంది పాత్ర కీలకమని, సింగరేణికి సంబంధించిన సామగ్రి దొంగతనానికి గురికాకుండా చూడాలని సూచించారు. ఏపీఏ ప్రాజెక్టు అధికారి కొలిపాక నాగేశ్వరరావు, ఓసీపీ–2 ప్రాజెక్టు అధికారి సీ.హెచ్.వెంకటరమణ, ఏరియా సెక్యూరిటీ అధికారి షబ్బీరుద్దీన్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, పర్యావరణ అధికారి రాజారెడ్డి, అధికారులు గుర్రం శ్రీహరి, పి.రాజేశం, మతీన్ హుస్సేన్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ టి.లింగయ్య పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పట్టించుకోని ఏఐటీయూసీ



ఆర్జీ–2 ఏరియా పిట్ సెక్రటరీలతో నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలో గుర్తింపు సంఘంగా గెలుపొందిన ఏఐటీయూసీ కార్మికుల సమస్యలు పట్టించుకోవడం లేదని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ నాయకులు ధర్మపురి ఆరోపించారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు ఇచ్చిన హామీలను ఐఎన్‌టీయూసీ నెరవేరుస్తుందని తెలిపారు. ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా గెలిచి ఏడాది గడుస్తున్నా నాయకులు కార్మికుల సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అనంతరం ఆర్జీ–2 ఏరియాలోని అన్ని గనుల్లో నూతనంగా ఎన్నుకున్న 11 మంది పిట్ కమిటీ సెక్రటరీలను ప్రకటించారు. వారు ఈరోజు నుంచి సంఘం కార్యక్రమాల్లో పాల్గొని సంఘం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. జనరల్ సెక్రటరీ అక్రమ్, జిల్లా అధ్యక్షుడు దాసు, శంకర్ నాయక్, ఆర్జీ–2 ఏరియా వైస్ ప్రెసిడెంట్ కొత్త సత్యనారాయణరెడ్డి, సదానందం, మార్కండేయ, దశరథంగౌడ్ పాల్గొన్నారు.

నర్సింగ్ అధికారి పరీక్ష ప్రశాంతం



తనిఖీ చేస్తున్న కళాశాల సిబ్బంది

రామగిరి: సెంటినరికాలనీ జేఎన్టీయూ కళాశాలలో రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ సర్వీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన నర్సింగ్ అధికారి పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం జరిగిన పరీక్షలో 150 మందికి 141 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 150 మందికి 148 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. రామగిరి ఎస్సై పెట్టం చంద్రకుమార్ ఆధ్వర్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చేపట్టారు.

అయ్యప్పస్వామి ఆలయంలో వార్షిక వేడుకలు



ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని అయ్యప్పస్వామి ఆలయం 23వ వార్షిక వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన గురుస్వామి శ్రీఅద్దెంకి సారంగాచారి ఆధ్వర్యంలో శనివారం గణపతి పూజ, ధ్వజారోహణం, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి మూలవిరాట్‌లకు ఫల పంచామృతాలతో అభిషేకాలు చేశారు. యాగశాల ప్రవేశం చేసి ఆలయ అర్చకులు దేవ్ ప్రకాశ్ పాండే భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం మహా అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు శంకర్ నాయక్, కండెం సురేశ్, స్టాలిన్‌గౌడ్, సుధాకర్‌రావు, రాయమల్లు, అయ్యప్ప దీక్షస్వాములు నరేందర్, సుమన్ స్వామి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న గ్రామ రైతులు

రామగిరి: ముత్తారం మండలంలోని హరిపురంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని గ్రామ రైతులు శనివారం డిమాండ్ చేశారు. గ్రామంలో కొనుగోలు కేంద్రం లేకపోవడంతో ధాన్యం విక్రయించేందుకు ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి కేంద్రం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.